# ఆర్టీసీలో 3035 కొత్త కొలువులు



> మొదటిపేజీ తరువాయి...

సూపరింటెండెంట్ (ట్రాఫిక్), 25 డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, 23 అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్), 15 అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్, 11 సెక్షన్ ఆఫీసర్ (సివిల్), 7 మెడికల్ ఆఫీసర్ (జనరల్), 7 మెడికల్ ఆఫీసర్ (స్పెషలిస్ట్) కొలువులు ఉన్నాయి.

### టీజీపీఎస్సీ ద్వారా ఆర్టీసీ నియామకాలు

కరీంనగర్, జూలై 2 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో కొత్తగా మరో 3,035 ఉద్యోగాల నియామకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు. జాబ్ క్యాలెండర్ విషయమై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పారదర్శకంగా పనిచేస్తున్నదని, బ్రోకర్లను విశ్వసించొద్దని, నేరుగా తెలంగాణ పబ్లిక్ కమిషన్ ద్వారా ఆర్టీసీ ఉద్యోగాల నియామకాలు జరుగుతాయని మంత్రి స్పష్టం చేశారు. మంగళవారం కరీంనగర్ జడ్పీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న తర్వాత మంత్రి మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీలో కొత్త బస్సుల కొనుగోలుకు నిర్ణయించామని, డ్రైవర్లు, శ్రామిక్, కండక్టర్లు అన్ని కలిపి 3,035 ఉద్యోగులను నియమించబోతున్నామని చెప్పారు. 2014 తర్వాత ఆర్టీసీలో మొట్టమొదటి రిక్రూట్‌మెంట్ అని, చనిపోయిన వారి స్థానంలో వారి పిల్లలతో వెయ్యి ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. ఇటీవల వెయ్యి బస్సులు కొనుగోలు చేశామని, డిమాండ్‌కు అనుగుణంగా కొత్తగా 2 వేల నుంచి 2,500 బస్సుల కొనుగోలుకు ప్రయత్నాలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్న రాయితీ చెల్లించడంతో ఆర్టీసీ నష్టాల నుంచి బయటపడిందని పేర్కొన్నారు. గతంలో ఉన్న బకాయిలన్నీ చెల్లించాల్సి ఉందని, దీనికోసం ప్రభుత్వం, ఆర్టీసీ శ్రమిస్తున్నదని చెప్పారు. 2013లో ఉన్న పెండింగ్ ఏరియర్స్ రూ.280 కోట్ల నుంచి రూ.80 కోట్లు చెల్లించామని, మిగతా రూ.200 కోట్ల చెల్లింపులో ఆర్థిక ఇబ్బందుల వల్ల కొంత ఆలస్యం జరుగుతున్నదని వివరించారు.

# రైతు ఆత్మహత్యపై విచారణ

- అధికారులను ఆదేశించిన సీఎం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం: మంత్రి తుమ్మల
- ఇదేనా మీ మార్పు?: కేటీఆర్, హరీశ్‌రావు ప్రశ్న
- అశ్రునయనాల మధ్య ప్రభాకర్ అంత్యక్రియలు



తమకు న్యాయం చేయండంటూ జోలె పట్టి ప్రాధేయపడుతున్న ప్రభాకర్ తండ్రి, కుటుంబ సభ్యులు

హైదరాబాద్, జూలై 2(నమస్తే తెలంగాణ): ఖమ్మం జిల్లా, మధిర నియోజకవర్గం, చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన రైతు బోజడ్ల ప్రభాకర్ ఆత్మహత్యపై సీఎం రేవంత్ రెడ్డి విచారణకు ఆదేశించారు. తమ భూమిని కొందరు నాశనం చేస్తున్నారని, అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని పేర్కొంటూ రైతు ప్రభాకర్ సోమవారం వీడియో ద్వారా ఆవేదనను వ్యక్తం చేశాడు. పురుగుల మందు డబ్బా చేతిలో పట్టుకొని, తాను చనిపోతున్నానని, తన చావు తర్వాతైనా కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను వేడుకొన్నాడు. ఆ తర్వాత పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సంచలనం కావడంతో రాష్ట్ర ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల స్పందించి విచారణకు ఆదేశించారు. ఈ ఘటనపై విచారణ జరిపి ప్రభుత్వానికి తక్షణమే నివేదిక అందజేయాలని రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించారు. రైతులు తమ పంటపొలాల పంచాయితీ కోసం ఆత్మహత్యకు పాల్పడొద్దని కోరారు. రైతు మృతి చెందడానికి కారణమైన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

### పదిమందిపై కేసు నమోదు

ప్రభాకర్ ఆత్మహత్యకు కారకులైన 10 మందిపై మృతుడి తండ్రి వీరభద్రయ్య ఖమ్మం హవేలీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ భానుప్రకాశ్ వారిపై కేసు నమోదు చేశారు. ఖమ్మం ప్రభుత్వ దవాఖానలో మంగళవారం పోస్టుమార్టం అయిన తర్వాత ప్రభాకర్ మృతదేహాన్ని స్వగ్రామం ప్రొద్దుటూరుకు తరలించారు. పోలీసు బందోబస్తులో గ్రామస్థుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తిచేశారు.

### కాంగ్రెస్ మార్పు ఇదేనా..?

తెలంగాణలో రైతులు ఆత్మహత్యకు పాల్పడే దుస్థితి దాపురించిందని, కాంగ్రెస్ నాంది పలికిన మార్పు ఇదేనా అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ప్రశ్నించారు. ప్రభాకర్ ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులు ఆత్మహత్య చేసుకునే విషాదకరమైన పరిస్థితులు నెలకొనడం బాధాకరమని మాజీ మంత్రి టీ హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో ఓ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ రైతు ప్రభాకర్ తనకు అన్యాయం జరుగుతున్నదని పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసుకున్నా పట్టించుకోకపోవడం వల్లనే ఓ నిండు ప్రాణం బలైందని పేర్కొన్నారు. రైతు తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఫిర్యాదు తీసుకోవడానికి కూడా పోలీసులు వెనుకడుగు వేయడంపై మండిపడ్డారు.

### రైతు ఆత్మహత్యపై స్పందించని భట్టి

మధిర నియోజకవర్గానికి చెందిన రైతు ఆత్మహత్య చేసుకున్నా డిప్యూటీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క స్పందించకపోవడంపై జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు మండిపడ్డారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ భట్టి ఎమ్మెల్యేగా ఉండటం మధిర ప్రజల దురదృష్టమని మండిపడ్డారు. భట్టి అనచరుల అరాచకాలతో అమాయక రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు.

## 213 మంది ఖైదీలకు క్షమాభిక్ష

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం 213 మంది ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించింది. ప్రభుత్వం పంపిన జాబితాకు గవర్నర్ ఆమోదముద్ర వేయడంతో ఖైదీల ముందస్తు విడుదలకు సర్కారు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీర్ఘకాలంగా జైళ్లలో మగ్గుతున్న తమ కుటుంబ సభ్యులను విడుదల చేయాలని ఖైదీల కుటుంబీకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రజాపాలనలో దరఖాస్తులు అందజేశారు. స్పందించిన సీఎం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలకు అనుగుణంగా ఖైదీల ముందస్తు విడుదలకున్న అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు అర్హులైన వారి వివరాలను హైలెవల్ కమిటీ ముందుంచగా, ఈ కమిటీ విడుదలకు అర్హులైన వారి జాబితాను క్యాబినెట్‌కు పంపగా ఆమోదముద్ర వేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం చర్లపల్లి జైలు నుంచి 213 మంది ఖైదీలు బుధవారం విడుదల కానున్నారు. వీరిలో 205 మంది యావజ్జీవ శిక్ష పడిన వారు, 8 మంది తక్కువ కాలం శిక్ష పడిన వారు ఉన్నారు.

# ఉచిత ప్రయాణం లేదు.. దిగిపోండి

- రాజన్న దర్శనానికి వచ్చిన కుటుంబానికి కండక్టర్ ఆదేశం
- ఆర్టీసీ బస్సులోంచి బలవంతంగా కిందికి
- సోషల్ మీడియాలో వైరల్.. వేములవాడ డీఎం విచారణ



వేములవాడ పట్టణంలోని జగిత్యాల బస్టాండ్‌లో ప్రయాణికులను బస్సు నుంచి కిందికి దింపుతున్న మహిళా కండక్టర్

వేములవాడ, జూలై 2: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని ఊదరగొడుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చిన ఓ కుటుంబం సోమవారం సాయంత్రం జగిత్యాల బస్‌స్టాప్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు ప్రయత్నించింది. ఈ సందర్భంగా బస్సులో విధులు నిర్వహిస్తున్న మహిళా కండక్టర్.. 'ఉచిత.. గిచిత ప్రయాణం లేదు.. ముందు తనిఖీ అధికారులు ఉన్నారు.. వారు చూస్తే రూ.500 జరిమానా విధిస్తారు' అంటూ సదరు కుటుంబ సభ్యులను బలవంతంగా కిందికి దింపారు. ఈ మొత్తం వ్యవహారాన్ని అక్కడున్న ప్రయాణికులు వీడియో తీసి.. సోషల్ మీడియాల్ పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది. ప్రయాణం మాట దేవుడెరుగు కానీ.. బలవంతంగా బస్సు నుంచి కిందికి దింపడంతో సదరు కుటుంబసభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న వేములవాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణ సదరు కండక్టర్‌ను పిలిచి విచారించినట్టు సమాచారం.

## 800 కిలోల నకిలీ పత్తి విత్తనాలు సీజ్

శామీర్‌పేట, జూలై 2: సూర్యాపేట నుంచి మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి నకిలీ విత్తనాలను రవాణా చేస్తున్నట్టు సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు మంగళవారం ఓ వాహనాన్ని తనిఖీ చేయగా కూరగాయల ఖాళీ ట్రేల వెనుక నకిలీ విత్తనాల సంచులను గుర్తించారు. 800 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## తమిళనాడు ఆర్టీసీపై రాష్ట్ర అధికారుల అధ్యయనం

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ) : రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్ ఆదేశాల మేరకు తమిళనాడులో రవాణాశాఖపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర రవాణాశాఖ అధికారుల బృందం రెండు రోజుల పర్యటన చేపట్టింది. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్, వాహన్ పోర్టల్, స్క్రాపింగ్ పాలసీ, పన్నులు, ఆదాయం, చెక్‌పోస్టులు, ఆన్‌లైన్ సర్వీసుల గురించి అధ్యయనం చేశారు. రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్, ఉప్పల్ ఆర్టీవో వాణి, కామారెడ్డి ఎంవీఐ శ్రీనివాస్ తమిళనాడు రవాణా శాఖ కమిషనర్ షణ్ముగసుందరంతో భేటీ అయ్యారు. ఇప్పటికే కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కేరళలో నాలుగు బృందాలు పర్యటించి ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేశాయి. వీరికి తోడుగా తమిళనాడు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేశ్, ఆర్టీవో సంపత్‌కుమార్, ఎంవీఐ కార్తీక్‌ను తమిళనాడు రవాణాశాఖ నియమించింది. త్వరలో కమిషనర్‌కు అధ్యయన నివేదిక సమర్పించనున్నట్లు చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు.

# 5 నుంచి భారీ వర్షాలు!

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా రాబోయే ఐదు రోజులు పాటు అక్కడక్కడ ఉపరితల గాలులు వీస్తాయని, వీటి ప్రభావంతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా వనపర్తి, నిర్మల్, జగిత్యాల, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మోస్తారు వర్షాలు కురిసినట్టు తెలిపింది. జూలై 5 నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది సాధారణ తేదీ కన్నా ఆరు రోజులు ముందుగానే దేశవ్యాప్తంగా విస్తరించాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. జూన్ 11 నుంచి 27 వరకు దేశంలో 16 రోజులపాటు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపింది.

### • వర్షాభావం.. రెండోసారి విత్తన భారం



వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులకు విత్తన భారం తప్పడం లేదు. వేలాది రూపాయల ఖర్చుతో రెండోసారి విత్తనాలు విత్తుతున్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా భైంసా మండలం ఇలేగాంలో పత్తి మొలకలు వాడిపోతుండటంతో మగ్గుతో మొక్క మొక్కకు నీరు పోస్తున్న రైతు. -భైంసాటౌన్

# పుణెలో ఘోర రోడ్డు ప్రమాదం

- నారాయణఖేడ్‌కు చెందిన ఐదుగురి దుర్మరణం

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ)/ నారాయణఖేడ్: మహారాష్ట్రలోని పుణె వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. వివరాలిలా ఉన్నాయి. నారాయణఖేడ్ పట్టణంలోని కటికె గల్లీకి చెందిన ఆరుగురు యువకులు సోమవారం ఉదయం కారులో నారాయణఖేడ్ నుంచి ముంబైకి బయలుదేరారు. మంగళవారం మధ్యాహ్నం పుణెలోని ఇందాపూర్ తాలూకా డాలజ్ వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న రెయిలింగ్‌కు ఢీకొన్నది. దీంతో వాహనం ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న రఫీక్ ఖురేషీ (25), ఫిరోజ్ ఖురేషీ (26), మహబూబ్ ఖురేషీ (27), ఫిరోజ్ (29), సయ్యద్ ఇస్మాయిల్ (26) అక్కడికక్కడే మృతి చెందగా సయ్యద్‌అమన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇతడు స్థానికం దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలియగానే కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లారు.

## 150 ఏండ్ల తర్వాత నల్లమలలో అడవి దున్న!

హైదరాబాద్, జూలై 2 (నమస్తేతెలంగాణ): నల్లమల అడవుల్లో 150 ఏండ్ల నుంచి కనిపించని అడవి దున్న (ఇండియన్ బైసన్) మళ్లీ ప్రత్యక్షమైంది. నెల రోజుల కిందట ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో దీన్ని గుర్తించారు. వెంటనే వీడియో, ఫొటోలు తీసిన సిబ్బంది విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాజాగా మళ్లీ వెలుగోడు రేంజ్‌లో అడవిదున్న కనిపించింది. నాగార్జునసాగర్- శ్రీశైలం పులుల అభయారణ్యం ఆత్మకూరు రేంజ్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా మాట్లాడుతూ ఇనేండ్ల తర్వాత అడవి దున్న కనిపించడం ఆశ్చర్యం కలిగించే విషయమేనని తెలిపారు. పెద్ద పులులు, ఏనుగులు వంటి భారీ జంతువులు సుదూర ప్రాంతాలకు తరలివెళ్లడం సాధారణమేనని, ఈ అడవి దున్న మైదానాన్ని దాటుకుని నల్లమల చేరి ఉంటుందని వెల్లడించారు.

## అన్నామలై మెడకు 'చెన్నై గోల్డ్ స్కాం'?!

- చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో 267 కిలోల బంగారం పట్టివేత
- గిఫ్ట్ షాప్‌లోని ఉద్యోగులతో రహస్యంగా స్మగ్లింగ్
- పట్టుకొన్న కస్టమ్స్ అధికారులు.. యజమాని అరెస్ట్
- బీజేపీతో సంబంధాలున్న వ్యక్తే కీలక సూత్రధారి?!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): చెన్నై విమానాశ్రయంలో ఇటీవల పట్టుబడ్డ 267 కిలోల బంగారం స్మగ్లింగ్ కేసు కొత్త మలుపు తిరిగింది. బీజేపీతో సంబంధాలున్న ఓ వ్యక్తే ఈ స్మగ్లింగ్‌లో కీలక సూత్రధారిగా పోలీసులు అనుమానిస్తున్నారు. అంతేకాదు, అతనికి తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలైతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని స్థానిక మీడియాలో వార్తలు రావడం కలకలం సృష్టిస్తున్నది. ఈ స్కాం విచారణ సందర్భంగా అన్నామలై పేరు కూడా బయటకు వచ్చినట్టు ఆ మీడియా వర్గాలు తెలిపాయి. అయితే, అధికారికంగా నిర్ధారణ కాలేదు.

### అసలేం జరిగింది?

చెన్నై విమానాశ్రయంలో గత గురువారం ట్రాన్సిట్ చెకింగ్ వద్ద అనుమానంగా తచ్చాడుతున్న ఓ వ్యక్తిని చెన్నై ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్‌కు చెందిన అధికారులు కస్టడీలోకి తీసుకొన్నారు. చెక్ చేయగా మలద్వారంలో కేజీ వరకూ బంగారం పేస్టు రూపంలో ఉన్నట్టు గుర్తించారు. అధికారులు మరింత లోతుగా విచారించగా, డిపార్చర్ ఏరియా వద్ద ఉన్న ఎయిర్‌హబ్ గిఫ్ట్ షాప్ ద్వారా ఈ స్మగ్లింగ్‌ను జరుపుతున్నట్టు, గడిచిన రెండు నెలల్లోనే 267 కిలోల బంగారాన్ని ఇలా తరలించినట్టు నిందితుడు ఒప్పుకొన్నాడు. దీంతో షాప్ యజమాని, యూట్యూబర్ అలీ సబీర్‌తో పాటు మరో ఏడుగురిని అరెస్టు చేశారు.



### అనుమానాలు ఇలా..

స్మగ్లింగ్‌కు కేంద్రంగా మారిన గిఫ్ట్ షాప్ గత ఫిబ్రవరిలోనే ప్రారంభించడం, సబీర్‌కు ఈ వ్యాపారంలో ఎలాంటి అనుభవంలేకపోవడంతో అధికారులు కేసును మరింత లోతుగా పరిశీలించారు. దీంతో ఆ షాప్ ఉన్న ప్రాంతాన్ని విద్వేదా పీఆర్‌జీ ఎండీ, బీజేపీతో సంబంధాలు ఉన్న జీపీ పృథ్వీ అనే వ్యక్తి కిరాయికి ఇచ్చినట్టు తేలింది. తనకు షాప్‌ను కిరాయికి ఇచ్చేలా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులను పృథ్వీనే ఒప్పించారని విచారణలో సబీర్ తెలిపారు. దీంతో కేసుకు సంబంధం ఉన్న అధికారులను ప్రశ్నించిన పోలీసులు.. పృథ్వీ నివాసంలోనూ సోదాలు నిర్వహించారు. అయితే, అతను అమెరికాకు వెళ్లినట్టు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. కాగా.. బంగారం స్మగ్లింగ్ ద్వారా గడిచిన రెండు నెలల్లో సబీర్ రూ. 3 కోట్లు సంపాదించినట్టు సమాచారం.

### పృథ్వీ బ్యాక్‌గ్రౌండ్ ఇది..

పృథ్వీకి బీజేపీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. 2010లో పృథ్వీ తమిళనాడు బీజేపీ యూత్ వింగ్ కో-కన్వీనర్‌గా పనిచేశారు. కేంద్రమంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, పోన్ రాధాకృష్ణన్ వంటి వారి దగ్గర సహాయకుడిగా మరికొన్ని రోజులు పనిచేశారు.



## వరదలతో అస్సాం అతలాకుతలం

గువాహటి, జూలై 2: అస్సాంను వరదలు ముంచెత్తుతున్నాయి. 8 నదులు ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. వరదల కారణంగా 19 జిల్లాల్లో 6.44 లక్షల మంది ప్రభావితమయ్యారని ఆ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న ఐఎండీ హెచ్చరికలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వరదల వల్ల కజిరంగ జాతీయ పార్కు తీవ్రంగా ప్రభావితమైంది. కొన్ని జంతువులు భద్రత కోసం దగ్గర్లోని కొండ ప్రాంతాలకు వలస వెళ్లాయి. ప్రస్తుతం 7 వేల మంది నిరాశ్రయులు ఉపశమన శిబిరాల్లో తలదాచుకుంటున్నారు.

# 4,000 కోట్ల స్కాంలో సిద్దరామయ్య!

## భార్యకు విలాస ప్రాంతాల్లో స్థలాల కేటాయింపు

- తెరవెనుక చక్రంతిప్పిన కుమారుడు యతీంద్ర
- ప్రతిపక్ష బీజేపీ నాయకుల సంచలన ఆరోపణలు
- కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని డిమాండ్
- కేటాయింపులు బీజేపీ హయాంలోనే: సీఎం సిద్ధు

బెంగళూరు, జూలై 2/(స్పెషల్ టాస్క్ బ్యూరో): కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్దరామయ్య భూకుంభకోణం వివాదంలో చిక్కుకొన్నారు. సిద్దరామయ్య, ఆయన కుమారుడు, ఎమ్మెల్సీ యతీంద్ర రూ. 4000 కోట్ల భూకుంభకోణానికి పాల్పడ్డారని ఆ రాష్ట్ర బీజేపీ ఆరోపించింది. సొంత జిల్లా మైసూరులో సీఎం తన సతీమణి పార్వతమ్మ పేరిట చట్టవిరుద్ధంగా కోట్ల విలువజేసే భూములు కేటాయించుకొన్నారని ప్రతిపక్ష బీజేపీ నాయకుడు ఆర్ అశోక్ ఆరోపించారు. ఈ కుంభకోణంలో మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) ఉన్నతాధికారులు ప్రమేయం కూడా ఉన్నదన్నారు. విషయం బయటకు రాకుండా ఉండేందుకే వారిని ప్రభుత్వం ఉన్నట్టుండి బదిలీపై పంపించిందని ఆరోపించారు. ఈ కుంభకోణం వివరాలు పూర్తిగా వెలుగులోకి రావాలంటే సీబీఐతో లేదా రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

### ఏమిటీ స్కాం?

బీజేపీ నేతల ఆరోపణల ప్రకారం.. మైసూరు శివారుల్లోని గ్రామీణ ప్రాంతాల్లో సిద్దరామయ్య భార్య పార్వతమ్మకు 3 ఎకరాల 16 గుంటల భూములు ఉన్నాయి. అయితే, అవసరాల దృష్ట్యా ఆ భూములను సేకరించిన ప్రభుత్వం.. వాటికి బదులుగా నగరంలోపల అత్యంత ఖరీదైన ప్రాంతాలుగా చెప్పుకొనే విజయనగర్, దట్టగల్లీ, జేపీ నగర్, ఆర్టీ నగర్, హంచయా-సతాగల్లీలో సిద్దు కుటుంబానికి భూములను కేటాయించింది. 50:50 నిష్పత్తిలో (పడావు పడ్డ ఒక ఎకరా తీసుకొంటే, అభివృద్ధి చేసిన అర్ధ ఎకరం ఇవ్వడం) ఈ భూముల కేటాయింపు జరిగింది. అయితే, సిద్దు కుటుంబానికి అత్యంత ఖరీదైన ప్రాంతాలలో ఆ భూములను కేటాయించాలని ఎవరు సిఫారసు చేశారని ఆర్ అశోక్ నిలదీశారు. క్యాబినెట్ అనుమతి లేకుండా భూములు కేటాయించే అధికారం ఎవరికి ఉంటుందని, ముఖ్యమంత్రికి తెలియకుండానే ఇంత పెద్ద కుంభకోణం జరిగిందా? అని ఆయన ప్రశ్నించారు.



భార్య పార్వతమ్మతో సిద్దరామయ్య(ఫైల్)

### సూత్రధారి యతీంద్ర!

ముడా భూకుంభకోణంలో యతీంద్ర పాత్ర ఉన్నదని, ఆయనే దీనికి అసలు సూత్రధారని బీజేపీ ఎమ్మెల్సీ హెచ్ విశ్వనాథ్ ఆరోపించారు. రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తుతో నిజాలు బయటకు రాబోవని, సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. అయితే, ఈ అక్రమాల్లో యతీంద్ర పాత్ర ఉన్నదో లేదో ఇంకా తేలాల్సి ఉన్నదని పట్టణాభివృద్ధి శాఖా మంత్రి భైరతి సురేశ్ అన్నారు. భూ కేటాయింపులకు సంబంధించిన అన్ని ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్టు పేర్కొన్నారు. దోషులపై తగిన చర్యలు తీసుకొంటామన్నారు.

### నాకేమీ తెలియదు: సిద్దు

బీజేపీ నేతల ఆరోపణలను సీఎం సిద్దరామయ్య ఖండించారు. తమ కుటుంబానికి ఎవరు, ఎలా ఆ భూములను కేటాయించారో తనకు తెలియదని పేర్కొన్నారు. బీజేపీ హయాంలోనే ఈ కేటాయింపులు జరిగినట్టు చెప్పుకొచ్చారు. రింగ్‌రోడ్డుకు సమీపంలో తన భార్య పేరిట 3.16 ఎకరాల భూమి ఉన్న మాట వాస్తవమేనని పేర్కొన్నారు. తమ 3.16 ఎకరాలను సేకరించకుండానే ముడా అధికారులు అక్కడ లే అవుట్ వేశారని చెప్పారు. ఆ స్థలాలను లబ్ధిదారులకు పంపిణీ కూడా చేశారని అన్నారు. చట్ట ప్రకారం మా భూములకు బదులుగా 50:50 ప్రాతిపదికన వేరేచోట భూములు ఇస్తామని ముడా అంగీకరించిందని చెప్పారు. ఇదంతా బీజేపీ అధికారంలో ఉన్నప్పుడే జరిగిందని అన్నారు. ఇందులో తప్పేముందని ప్రశ్నించారు. భూముల కేటాయింపుల్లో 50:50 ఫార్ములాను బీజేపీనే ప్రతిపాదించిందని పేర్కొన్నారు.

## కూతురిపై అఘాయిత్యం.. 101 ఏండ్ల జైలు

తిరువనంతపురం, జూలై 2: మైనర్ అయిన కూతురిపై ఆరేండ్లపాటు లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి కేరళలోని ఒక కోర్టు 101 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. దయ చూపడానికి దోషి అనర్హుడని కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. తన తండ్రి ముహమ్మద్ తనపై పాల్పడిన అఘాయిత్యాల గురించి బాధితురాలు 16 ఏండ్ల వయసులో గర్భం దాల్చిన తర్వాత బయటకు వెల్లడించింది. తండ్రులందరూ తమ కూతుళ్లతో ఇలాగే ప్రవర్తిస్తారని దోషి తన కూతురితో చెప్పినట్టు తెలుస్తున్నది.

## నేపాల్ ప్రధాని ప్రచండకు షాక్

కాఠ్మాండూ, జూలై 2: నేపాల్ రాజకీయాలు నాటకీయ మలుపు తీసుకున్నాయి. ప్రధాని ప్రచండ తీరుపై అసంతృప్తితో ఉన్న సీపీఎన్-యూఎంఎల్ చైర్మన్ కేపీ శర్మ ఓలీ.. నేపాలీ కాంగ్రెస్‌తో జట్టు కట్టి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నారు. ఈ మేరకు ఇరు పార్టీల మధ్య సోమవారం రాత్రి అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం రొటేషన్ పద్ధతిలో ప్రధాని పదవిని పంచుకోవాలని ఇరు పార్టీలు నిర్ణయించాయి. మరోవైపు తాను ప్రధాని పదవికి రాజీనామా చేయనని.. ప్రతినిధుల సభలో విశ్వాస పరీక్షను ఎదుర్కొంటానని ప్రచండ తెలిపారు.

## ఆకుపచ్చగా మారుతున్న సముద్రాలు

న్యూఢిల్లీ: నీలి రంగులో కనిపించే సముద్ర జలాలు ఆకుపచ్చ రంగులోకి మారుతున్నాయి. మానవ కంటికి కనిపించని ఈ మార్పు, సముద్ర పర్యావరణ వ్యవస్థలో అత్యంత నిగూఢంగా జరుగుతున్నదని పరిశోధకులు గుర్తించారు. భూమిపై మహా సముద్రాల రంగులో గణనీయమైన మార్పు వచ్చిందని బ్రిటన్‌కు చెందిన 'నేషనల్ ఓషియోనోగ్రఫీ సెంటర్' పరిశోధకులు తేల్చారు. గ్లోబల్ కార్బన్ సైకిల్, సముద్ర పర్యావరణ వ్యవస్థలో ఏర్పడ్డ మార్పులే దీనికి కారణమని అధ్యయనం పేర్కొన్నది. నాసాకు చెందిన 'ఆక్వా' శాటిలైట్ గత 20 ఏండ్లుగా విడుదల చేస్తున్న డాటాను పరిశోధకులు విశ్లేషించగా, సముద్ర జలాల్లో 56శాతం ఆకుపచ్చ రంగులోకి మారిందని, రంగు మార్పు 2002 నుంచి మొదలైందని తేలింది.

## రోజూ దేవుడిని ప్రార్థిస్తున్నాడని మరణ శిక్ష జీవితఖైదుగా మార్పు

కటక్: ఆరేండ్ల బాలికపై లైంగిక దాడి, హత్య కేసులో ఉరిశిక్ష పడ్డ దోషి శిక్షాకాలాన్ని ఒడిశా హైకోర్టు జీవిత ఖైదుగా మార్చింది. నిందితుడు దేవుడికి అంకితమైపోయి రోజూ పలుసార్లు ప్రార్థనలు చేస్తున్నందున అతడి శిక్షను తగ్గిస్తున్నట్టు పేర్కొంది. అలాగే ఈ కేసులో మరో నిందితుడిని నిర్దోషిగా విడుదల చేసింది. 2022లో ఒక బాలికపై లైంగిక దాడి చేయడమే కాక, ఆమెను హత్యచేసిన కేసులో ఆసిఫ్ అలీ (37), అఖిల్ అలీ (38)లకు మరణ శిక్ష విధిస్తూ ట్రయల్ కోర్టు తీర్పు చెప్పింది. తాజాగా హైకోర్టు దానిని జీవిత ఖైదుగా మార్చింది. 'నిందితుడు ప్రతి రోజూ అనేక పర్యాయాలు దేవుడికి ప్రార్థనలు చేస్తున్నాడు. తాను దేవుడికి లొంగిపోయినందున ఎలాంటి శిక్ష అనుభవించడానికైనా సిద్ధంగా ఉన్నట్టు తెలిపాడు' అని జస్టిస్‌లు సాహూ, ఆర్‌కే పట్నాయక్ పేర్కొన్నారు. అందుకే అతడి మరణశిక్షను జీవిత ఖైదుగా మారుస్తున్నట్టు తీర్పు చెప్పారు. బాధితురాలి కుటుంబానికి 10 లక్షల పరిహారాన్ని అందించాలని ఆదేశించారు.

## 5 సార్లు పాముకాటు.. అయినా బతికాడు!

లక్నో: పాములు పగబడతాయా? యూపీలోని ఫతేపూర్‌కు చెందిన వికాస్‌దూబే గురించి తెలిస్తే మాత్రం నిజమేనని అనుకోకమానరు. రెండునెలల్లో ఏకంగా ఐదుసార్లు అతడు పాముకాటు బారినపడ్డాడు. నాలుగుసార్లు కాటేశాక చోటు మారినా పాము అతడిని వదల్లేదు. జూన్ 2న రాత్రి ఇంట్లో తొలిసారి వికాస్‌ను పాము కాటేసింది. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. చికిత్స అనంతరం కోలుకున్నాడు. 10న మరోమారు అతడు పాము కాటు బారినపడ్డాడు. చికిత్స తీసుకున్నాక పాములంటే అతడికి భయం పుట్టింది. నిత్యం అప్రమత్తంగా ఉండేవాడు. అయినప్పటికీ అదే నెల 17న మళ్లీ అతడిని పాము కాటేసింది. ఈసారి అతడు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. మళ్లీ అదే దవాఖానలో చికిత్స పొందాడు. ఆ తర్వాత కొన్ని రోజులకే మళ్లీ పాము కాటేసింది. మళ్లీ వచ్చిన దూబేను చూసి వైద్యులు ఆశ్చర్యపోయారు. వైద్యులు, బంధువుల సలహా మేరకు దూబేను కుటుంబ సభ్యులు సొంత ఇంటికి దూరంగా ఫతేపూర్‌లోని రాధానగర్‌లో ఉంటున్న అతడి అత్తయ్య ఇంటికి తరలించారు. దురదృష్టం మరోమారు వెంటాడడంతో అక్కడ కూడా ఐదోసారి పాము కాటేసింది.

## గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకుని.. అడవిలో చిక్కుకుని!

కటక్: ఈ మధ్య గూగుల్ మ్యాప్స్ నావిగేషన్‌ను నమ్మి కొంతమంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తాజాగా ఒడిశాలో కటక్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు బైక్‌లపై సప్తసజ్య ఆలయానికి వెళ్లారు. కొండపై ఉన్న విష్ణుబాబా మఠానికి జూన్ 30న చేరుకున్నారు. తిరిగి వచ్చే క్రమంలో గూగుల్ మ్యాప్స్‌పై ఆధారపడి.. నావిగేషన్ పెట్టుకున్నారు. అది అడవి మధ్యలోకి తీసుకెళ్లింది. దీంతో 11 గంటల పాటు వారంతా అడవిలోనే చిక్కుకున్నారు. అలసిపోయి ఆహారం లేకుండా సాయంత్రం 5.30 గంటలకు భూషుని ఖోలాకు చేరుకున్నారు. ఆ ప్రాంతం సందర్శకులకు నిషేధం. ఆ ప్రదేశంలో సహాయం కోసం ఎదురుచూసి, అతి కష్టం మీద పోలీసులను సంప్రదించగలిగారు. దెంకనల్ పోలీసులు, అటవీశాఖ సమన్వయంతో రెస్క్యూ ఆపరేషన్ చేసి విద్యార్థులను గుర్తించారు.

## మతమార్పిళ్లతో మైనార్టీలోకి మెజార్టీలు

అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యలు

ప్రయాగ్‌రాజ్(యూపీ): మతమార్పిళ్ల విషయంలో అలహాబాద్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మతమార్పిడి జరిగే మతపరమైన సమ్మేళనాలను వెంటనే ఆపకుంటే దేశంలోని మెజారిటీ జనాభా ఏదో ఒక రోజు మైనారిటీలుగా మారిపోతారని ఆందోళన వ్యక్తంచేసింది. ఓ గ్రామంలోని పలువురితో మతమార్పిడి చేయించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కైలాశ్ అనే నిందితుడి బెయిలు పిటిషన్‌ను తిరస్కరించిన జస్టిస్ రోహిత్ రాజన్ అగర్వాల్ మాట్లాడుతూ 'ప్రోపగేషన్' పదానికి ప్రచారం కల్పించడం అని అర్థమే కానీ, ఓ వ్యక్తిని తన మతం నుంచి మరో మతంలోకి మార్చడం కాదని స్పష్టం చేశారు. ఈ కేసులో కైలాశ్‌పై తీవ్రమైన ఆరోపణలున్నాయి. మతమార్పిడుల విషయాన్ని బయటపెట్టిన మహిళ, ఆమె సోదరుడితోపాటు గ్రామానికి చెందిన మరికొందరిని న్యూఢిల్లీలో జరిగిన ఓ సమావేశానికి తీసుకెళ్లిన నిందితుడు అక్కడ వారిని క్రైస్తవంలోకి మార్చేశాడు. విషయాన్ని బయటపెట్టిన మహిళ సోదరుడి ఆచూకీ ఇప్పటి వరకు లేదు.